కథ

# మార్పు

• కె.వరలక్ష్మి

"ఇదేంతి నాన్నా?"

"అది చాలా... పే... ద్ద భవంతి అమ్మా" నవీన్ పేపర్లోంచి తల తిప్పి శిశిరపాపాయి చూపిస్తున్న 'ఇన్‌సైడ్ అవుట్‌సైడ్' మేగజైన్‌లోని ఫోటోను చూస్తూ అన్నాడు.

"దీంత్లో ఎవలుంతాలు నాన్నా"

"ఊ... ఎవరంటే... అమ్మ, నాన్న, పాపాయి"

"త్లీ మెంబస్సుకి అంత బెద్ద ఇల్లు ఎందుకు నాన్నా"

ఇరుక్కున్నట్టు మొహం పెట్టేడు నవీన్. ఆ మధ్యనోసారి కారు పార్కు చేసిన చోట గోనెసంచుల గుడిసెలో బోల్డెడు పిల్లలున్న కుటుంబాన్ని చూస్తూ "అంత బోలెడు మందికి ఇంత బుల్లి ఇల్లుందేం?" అని అడిగింది. 'నాలుగేళ్ల పసిదానికి ఇలాంటి ప్రశ్నలెలా తడుతున్నాయి?' అన్పించింది. చూపుడు వేలుతో పాపాయి చుబుకాన్ని పైకెత్తి నవ్వకుండానే నవ్వే కళ్లలోకి పరిశీలనగా చూసేడు.

దట్టమైన రెప్పలకింద ప్రశ్నలు నింపుకొన్న కళ్లు.

"ఏంటి నవీన్ చిన్న పిల్లాడిలా పొద్దున్నే దానితో కబుర్లు, ఎంత దూరం ప్రయాణం చెయ్యాల్సి ఉంది! కారు రెడీ చెయ్యమని డ్రైవరుకి చెప్పు. లక్ష్మీ! టిఫిన్లు సర్దేవా, ముందు మాకు కాస్త కాఫీ పొయ్" అరుపుల అవధానం చేస్తోంది అరుణ.

అరుణ కాఫీ కోసం నాల్గోసారి అరుస్తూండగా ట్రేలో రెండు కాఫీ కప్పులు, పాపాయి పాలగ్లాసు పెట్టుకుని వంటింట్లోంచి బైటికొచ్చింది లక్ష్మి. పన్నెండేళ్ల ఆ పిల్ల జుట్టు చింపిరిగా చెంపల మీద పడుతోంది. ఆ ఉదయపు చల్లదనంలో కూడా వంటింటి పని వొత్తిడికి ముఖం చెమటల్తో నిండిపోయింది. వెలిసిన పరికిణీ నేలను జీరాడుతోంది. పొడవైన లూజు జాకెట్టు ఓ భుజం కొంత కిందికి జారింది.

అరుణ ఆ పిల్లను అసహనంగా చూసింది.

"నీకెన్నిసార్లు చెప్పాలే, ఆ పల్లెటూరి పిచ్చిగుడ్డలేసుకోవద్దని"

అరుణ వాక్యం పూర్తి చేసేలోపల లక్ష్మి జాకెట్టు భుజం మీదికి లాక్కుంటూ ఏదో పని తొందరలో వంటింట్లోకి పరుగెత్తింది.

"నవీన్, దీంతో చాలా హెడేక్‌గా ఉంది. మన పాపాయి పుట్టినప్పుడు వచ్చింది. నాలుగేళ్లు కావస్తోంది. అయినా దీనికి ఆ పల్లెటూరి వాటం పోవడం లేదు. దీని బాబేమో ఏడాదికోసారి పది వేలు పట్టుకుపోతాడు. మళ్లీ వొంగి తొంగి చూడడు. దీనికీమధ్య జ్వరం వస్తే ఎంత ఖర్చైంది! అవన్నీ సరే, చుడీదార్లు కొన్నానా, అవి వేసుకోదు, ఆ తీరు చూడు చింపిరి జుట్టేసుకుని"

"కూల్ బేబీ, లైట్ తీస్కో, ముందు ప్రయాణం సంగతి చూడు"

నవీన్, అరుణ తయారై కిందికొచ్చేసరికి ప్రయాణానికి టిఫిన్స్, పాలు, జూసులు, బిస్కట్స్ లాంటివి సర్దిన బేస్కెట్ కారులో పెట్టి; పాపాయికి స్నానం చేయించి తేలిక పాటి డ్రెస్ వేసి తయారు చేసింది లక్ష్మి. తను స్నానం చేసి, చుడీదార్ వేసుకుని, జుట్టు నున్నగా దువ్వుకుని తయారైంది.

శిశిర ముఖంలోలాంటి ఆనందమే ఆ పిల్ల ముఖంలోనూ తాండవిస్తోంది. పంజరంలోంచి బైటికెగరబోయే పక్షిలాంటి ఉత్సుకత, ఉత్సాహం.


పౌడరద్దుకుని బొట్టు పెట్టుకున్న ఆ పిల్ల మొహంలోని కళను చూస్తూ 'బహుశా మరో ఏడెనిమిదేళ్లకి శిశిర ఇంతవుతుంది కావచ్చు' అనుకున్నాడు నవీన్.

అమ్మ నాన్న రావడం చూసి "పద, మనం కారెక్కుదాం" అంది శిశిర. లక్ష్మి చెయ్యి పట్టుకుని కారు దగ్గరకి లాక్కెళ్తోంది.

"తనెక్కడికి?" అని పాపని కసిరి "లక్ష్మీ నువ్వు ఇంట్లో ఉండు, ఫ్రిజ్‌లో నాలుగైదు రోజులకి సరిపడా సాంబారుంది. టేబుల్ మీద నిమ్మకాయ పచ్చడి ఉంది. వేళకి అన్నం వండుకుని తిను" అంది అరుణ.

లక్ష్మి కళ్లల్లో ఆనందం మాయమై భయం ప్రవేశించింది.

"చిన్నపిల్ల తను ఒక్కత్తీ ఎలా ఉంటుంది?" అనబోయి "లక్ష్మి ఇంట్లో ఉండిపోతే శిశిరని ఎవరు చూసుకుంటారు?"



అన్నాడు నవీన్.

"శిశిరను ఒకళ్లు చూసుకునే అవసరం లేదిప్పుడు. దానికి నాలుగేళ్లొచ్చాయి. ఏం మందు పెట్టిందో, దానికి అంటుకుపోతోంది. అయినా నేను లేనా, నాకేం ఉద్యోగమా సద్యోగమా? ఇంటికి తాళం వేసి బైటికెళ్లడం సిటీలో ఎంత ప్రమాదంగా ఉందో రోజూ న్యూస్‌లో చూడ్డంలేదా" అంది అరుణ.

"పొద్దుపోకముందే లైట్లు వేసుకో. నవీన్, నువ్వలా చూడకు. రోజూ మనం ముగ్గురం బైటికెళ్లే రోజుల్లో రాత్రివరకూ తనొక్కత్తే కదా ఇంట్లో ఉండేది. తన కలవాటేలే" మనసు మారిపోతుందేమో అన్నంత ఆత్రంగా తలుపుమూసి బైటనుంచి లాక్ చేసింది.

'లక్ష్మి విషయంలో ఈ మధ్య మరీ ఎందుకిలా ప్రవర్తిస్తోంది? తల్లి లేని ఆ పిల్లను తండ్రి రాళ్లెత్తేలాంటి బరువు పనులకు పంపిస్తున్నాడని జాలిపడి వాళ్ల ఊరినుంచి తీసుకొచ్చింది. ఎంతో బాగా చూసుకునేది. ఖాళీ సమయంలో చదువు చెప్పేది. లక్ష్మి కూడా మంచి పనిమంతురాలు. అంత చిన్న వయసులోనే అరుణకు ఇంటి పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేది. పాపాయిని చూసుకునేది. అమ్మా అమ్మా అంటూ అరుణకు చాలా చేరికగా ఉండేది. ఈ మధ్య భయంతో దూరదూరంగా మసలుతోంది. అరుణది జాలి కాదేమో, అవసరమేమో! పాపాయి పెద్దదవుతోంది. ఇక ఆ పిల్ల అవసరం తీరిపోయినట్లుంది' అనుకున్నాడు నవీన్. తామూ సిల్వర్ స్పూన్‌తో పుట్టినవాళ్లు కాదు. ఉద్యోగాల వల్ల ఆర్థికంగా నిలదొక్కుకున్నవాళ్లు. ఇంట్లో వొంటరిగా ఉంటున్నా ఆ పిల్ల తనను అస్సలు పట్టించుకోవడంలేదనీ, దగ్గరకే రావడం లేదనీ అరుణ కంప్లైంట్.

రోజు రోజుకీ అరుణలో సున్నితత్వం కోల్పోతున్న ఏదో మార్పు గమనిస్తున్నాడు నవీన్. కోపం కూడా ఎక్కువైంది. తనన్నదానికి ఏమాత్రం ఎదురు చెప్పినా సహించలేకపోతోంది.

దీనికంతటికీ కారణం అదేనా?... సాఫ్ట్‌వేర్ సంక్షోభంలో తను ఉద్యోగం కోల్పోయింది నిజమే. కాని, తన ఒక్కడి సంపాదనతో కూడా ఏ లోటూ లేకుండా ఇల్లు నడవగలదు. అయినా, అరుణ బాగా డిస్టర్బైంది. తన అస్తిత్వాన్ని కోల్పోయినట్టు ఫీలవుతోంది.

'అరుణ స్థానంలో నేను ఉండి ఉంటే...' అనుకున్నాడతను. ఏమో... ఆ ఊహే భరించలేనిదిగా ఉంది.


ఇప్పుడీ ప్రయాణం అరుణ కొంత తేరుకుంటుందేమోనని. చాన్నాళ్లుగా బైటికెక్కడికీ వెళ్లలేదు. వీకెండ్‌కి మరో రెండు రోజులు సెలవులు కలిసి వచ్చాయి. కొలీగ్స్ మరో పదిమందితో కలిసి ఈ ట్రిప్ ఎరేంజ్ చేసాడు నవీన్. నాగార్జునసాగర్‌లో ఉన్న ఓ మిత్రుడు అక్కడి ఏర్పాట్లన్నీ చూస్తానన్నాడు.

ఉదయాన్నే బయలుదేరడం నుంచి ఎనిమిది గంటలకంతా అక్కడున్నారు.

మార్చి నెల ఆరంభం. గెస్ట్‌హౌస్ ముందు గార్డెన్‌లో రాత్రి విరిసిన రేరాణి పూలలోని మంచుబిందువులు ఆవిరవుతూ మరోసారి పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఆకులన్నీ రాల్చేసిన బోగన్‌విల్లా మొక్కలు అద్భుతమైన రంగుల పూలతో ఆపాదమస్తకం అలంకరించుకుని హొయలు పోతున్నాయి. శిశిర కారు దిగుతూనే ఎప్పుడు పరుగెత్తిందో దూరంగా పూలపొదల మధ్యలో ఓ పువ్వులా కన్పిస్తోంది. నిలిచిన చోట నిలవ కుండా చైతన్య స్రవంతిలా పరుగులు పెడుతోంది.

దూరంగా రివర్ వ్యూ...

చూస్తూ నిలబడిపోయిన అరుణ భుజం చుట్టూ చెయ్యి వేసి పోర్టికో నీడలోకి నడవబోయాడు నవీన్.



అంతలో ఎక్కడి నుంచి వచ్చిందో ఆల్సేషియన్ కుక్క ఒకటి పెద్దగా అరుస్తూ వాళ్ల ముందుకు దుమికింది.

చిరుతపులిని చూసినదానిలా అరుణ ఉలిక్కిపడి నవీన్‌ని కరుచుకుపోయింది. దాని ఆకారం చూసి నవీన్ కూడా భయపడ్డాడు. వొళ్లంతా ఎర్రని బొచ్చు, భీకరమైన కళ్లు, పళ్లు... ఏం తిని ఎదిగిందో పొడవుగా, బలిష్ఠంగా...

వాచ్‌మేన్ పరుగున వచ్చి "ఏయ్ రామూ" అన్నాడు. అది ఠక్కున అరవడం ఆపేసింది. కొంచెం దూరం వెళ్లి అక్కడ నిల్చుని అనుమానంగా చూడసాగింది. అక్కడున్న కుర్చీల్లో నిస్సత్తువగా కూర్చుండిపోయారిద్దరూ.

"సారీ సార్" అన్నాడు వాచ్‌మేన్ అపాలజైటిక్‌గా.

"గెస్ట్‌హౌస్‌కి కుక్క ఎందుకు. అదీ ఇంత భయంకరమైనది."అని విసుక్కుంది అరుణ.

"ఇది ఇక్కడి పెంపుడుకుక్క కాదు మేడమ్. కొన్నాళ్లక్రితం ఎక్కడి నుంచి వచ్చిందో ఇక్కడుండిపోయింది".

"ఇంకా ఎవరూ రాలేదా?" అన్నాడు నవీన్ ఏదో ఒకటి మాట్లాడాలని. శిశిర దూరం నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి కుక్క ముందు నిల్చుంది.

"శిశిర పాపా" అని అరుణ అరిచేలోపలే దాని ముఖాన్ని చేతితో తాకింది. తలను నిమిరింది. పక్కన చేరి వీపు నుంచి తోక వరకూ స్పర్శించింది.

కుక్క ప్రేమగా పాపాయి బుగ్గను నాలుకతో తాకింది. మంత్రముగ్ధలాగా కళ్లు మూసుకుని పాపాయి చేతికిందికి తలను దూర్చి చేరబడింది.

అరుణ భయంతో బిగుసుకుపోయింది.

"అమ్మా, ఇది నా ఫ్రెండ్" అంది శిశిర.

కారు దగ్గరకి పరుగెత్తి బిస్కట్ల పేకెట్టు తెచ్చి ఒక్కొక్కటే కుక్కకు తిన్పించసాగింది. రామూ తోకాడిస్తూ నిజంగానే పాపాయికి ఫ్రెండైపోయింది.

"ఏంటి నవీన్ చూస్తున్నావు, అది కరిస్తే...? వెళ్లి పాపాయిని తీసుకురా" అంది కీచుగొంతుతో అరుణ.

"అది శిశిరనేం చెయ్యదు, భయపడకు" అన్నాడు నవీన్ నిశ్చయంగా. ఇంకాస్సేపటికి కారు పార్కింగంతా రకరకాల, రంగు రంగుల కార్లతో నిండిపోయింది.

పదయ్యేసరికంతా గెస్ట్‌హౌస్ డైనింగ్ హాల్లోని పెద్ద రౌండ్ టేబుల్ పదార్థాలతోనూ, కుర్చీలు మనుషుల్తోనూ నిండిపోయాయి.

పలకరింపులు, ప్రదర్శనలు మొదలయ్యాయి. బైట కుక్కతో ఆడుతున్న శిశిరను లాక్కొచ్చింది అరుణ.

ఎవరో అన్నారు "నవీన్, అది ముసలిదైపోయిన ఆల్సేషియన్ డాగ్, పట్టుకుందంటే కండలు పీకిపెడుతుంది జాగ్రత్త!"

శిశిర మాత్రం కుక్క దగ్గరకు తీసుకెళ్తేనే టిఫినైనా, అన్నమైనా తింటోంది. లేదా కుక్కను డైనింగ్ హాల్లోకి పిలవమంటోంది. అందరూ రకరకాల కబుర్లతో, గేమ్స్‌తో టైంపాస్ చేస్తూంటే తను మాత్రం కుక్కతో ఆడుతోంది. కబుర్లు చెప్తోంది.

శిశిర నుంచి కుక్కనో, కుక్క నుంచి శిశిరనో విడదీయడం ఎవరి వల్లా కావడంలేదు.

రాత్రి వెన్నెల్లో అందరూ గార్డెన్లో కుర్చీలు వేసుకుని కూర్చుంటే మధ్యలో నేలపైన శిశిర కూర్చుంది. శిశిర వొడిలో తల పెట్టుకుని కుక్క పడుకుంది.

"ఈ పిల్లకు బుద్ధి లేకుండా పోతోంది. ఏదో ఒకదానికి అతుక్కుపోతుంది. ఇంట్లో లక్ష్మికి, ఇక్కడ కుక్కకి" అరుణ విసుగుతో సణుగుతోంది.


"ఇది నిజంగా మిరకిల్, అపరిచితులకి ఈ కుక్కలు అస్సలు మాలిమికావు" అన్నాడు నిరంజన్.

(ముగింపు 41వ పేజీలో)

ఆ ఇల్లాలు పడుతున్న అవమానాలకి బాధపడి స్పందించిన తీరు, ఆమెని ఈ కీచకుడి నుండి విముక్తి చేయాలన్న సంకల్పంతోనూ రాజారావ్ ఢీకొని చివరకు విజయం సాధిస్తాడు. ఈ కథల్లో స్త్రీల దైన్యావస్థకి మూలం వివాహ వ్యవస్థే నన్నది రచయిత ప్రతిపాదించిన సిద్ధాంతంతో పాఠకులు ఏకీభవి స్తారు. పురుషులు తాగుబోతులు, జూదగాళ్లు, వ్యభిచారులు, ద్రోహులు, ఇంకా ఇంకా పతనమైన పాత్రలు...

'పతివ్రత' కథలో నాయకుడు బిజినెస్ ఎగ్జిక్యూటివ్. సింగపూర్‌లో ఆఫీస్ పనిమీద వెళ్లినప్పుడు, అక్కడ విలాసవంతమైన హోటల్‌లో పడకగది పొందుకోసం 'విదేశీ సరుకు' దొరకలేదు. అక్కడ స్వదేశీ సరుకే విదేశీ అందాలను అలంకరించుకుని వచ్చింది. మేరీ మలయాళీ యువతి. నర్స్ వృత్తి. ప్రేమించి పెళ్లి చేసుకున్న మేరీ భర్త తాగుడుతో, పేకాటలో అప్పుల్లో కూరుకుపోతే- సంసారాన్ని కాపాడాలని స్నేహితురాలి సహాయంతో సింగపూర్ వచ్చి ఒంటరి జీవితం జీవిస్తున్న మేరీ. ఇద్దరి పిల్లల్ని కేరళలో తన తలిదండ్రుల దగ్గర విడిచిపెట్టి- హైదరాబాద్‌లో భర్త వివరాలు తెలియక నెల దినాలు సెలవు పెట్టి వెళ్తే అక్కడ భర్త రెండు కిడ్నీలు చెడిపోయాయని డయాలిసిస్ దశలో ఉన్నాడని, మూత్రపిండాల మార్పిడి ఒక్కటే శరణ్యం అని డాక్టర్లు చెప్పినప్పుడు- మేరీ కుంగిపోయింది. కుమిలిపోయింది. దొరికిన చోటల్లా అప్పులు తెచ్చి, బంధుమిత్రుల్లో దాతలెవ్వరూ దొరక్క, తనదే ఒక కిడ్నీ ఇచ్చింది. ఆపరేషన్ విజయవంతమయింది. ఆయన మళ్లీ మనిషియ్యాడు. మేరి తిరిగి సింగపూర్ వచ్చింది. భర్త ప్రాణాన్ని కాపాడిన సంతోషం. ఆదాయాన్ని అప్పులు మింగేస్తుంటే ఈ వళ్లమ్ముకునే మార్గం దొరికింది.

సింగపూర్‌లో మేరి కథ తెలుసుకున్న అత్తమామలు, మేరి పతివ్రత కాదని కొడుక్కి రెండోపెళ్లి ఒక పతివ్రతతో చేస్తారు.




మేరీ కథ, మేరీ ప్రేమ, మేరీ త్యాగాలు, మేరీ జీవితం పోరాటాలు పాఠకునికి కన్నీళ్లు తెప్పిస్తాయి.

***

దిగంబర కవితోద్యమం, కవిత, సృజన, జీవనాడి, తిరగబడు కవిత్వం రోజుల్లో మేమంతా న్యూ వేవ్ రచయితలుగా, కథ, హోరు, జనం, తూరుపు కథా సంపుటాలు బులిటెన్‌లు తెచ్చేవాళ్లం. నారాయణగూడా వై.ఎమ్.సి.ఎ. కూడలికి అయిదు పది నిమిషాల నడక దూరంలో మా ఇళ్లుండేవి. దాదాపు పది పదిహేను మంది రచయిత మిత్రులం తరచు విఠల్‌వాడిలోని వెంకట్రామయ్యగారి ఇంట్లో సమావేశమై మా కొత్త కథలు రాతప్రతులు చదువుకుని చర్చించుకునేవాళ్లం. ఆ సమావేశాల్లో చదవడం కోసమే కొన్నిసార్లు కొత్త కథలు రాసేవాళ్లం. ఇతర నగరాల నుండి వచ్చే రచయితలు సైతం అక్కడ కలుసుకునేవాళ్లు. ఈ కథల్లో చాలా కథలు అప్పుడు చదివినవే కావడం ఒక ఔచిత్యం.

వెంకట్రామయ్యగారి ముందు మాటతో ఈ వ్యాసం ముగిస్తాను.

"సామాజిక ప్రయోజనంగల రచన అన్నంత మాత్రాన వస్తువుకు ఎంత ప్రాముఖ్యం ఇచ్చినా, రూపానికున్న ప్రాధాన్యాన్ని విస్మరించకూడదని నా అభిప్రాయం. వస్తువుకి రూపానికి మధ్య సరైన సమన్వయం సాధించగలిగినప్పుడే ఆ రచన సార్థకమౌతుందని నా నమ్మకం. ఇటువంటి సమన్వయాన్ని సాధించటానికే నేను కృషి చేశాను. ఆకలి కథ కూడా ఆసాంతం ఏడుపుగొట్టుగా వుండనక్కర్లేదని, ప్రయోజనకరమైన కథలు కూడా పాఠకులకు ఆసక్తికరంగా, ఆహ్లాదకరంగా వుండొచ్చునని రుజువు చెయ్యడానికి నేను ప్రయత్నించాను. కథలో వస్తు ప్రాముఖ్యాన్ని తగ్గించకుండానే కథనంలో అనేక ప్రయోగాలు చేశాను. అయితే నేను చెప్పదలచుకున్న విషయాన్ని మరింత బలంగా, మరింత ఆసక్తికరంగా చెప్పడానికే తప్ప, కేవలం ప్రయోగం చేశాననుకోవడం కోసం ప్రయోగాలు చెయ్యలేదు. నా భాష, నా శైలి, నా శిల్పం- నావిగానే ఉంచుకోవడానికి కూడా నేను కొంత ప్రయత్నం చేశాను. నా ప్రయత్నాలూ, ప్రయోగాలు ఏ మేరకు సఫలమైనాయో చెప్పవలసింది సహృదయులైన పాఠకులే".

- శ్రీపతి

# మార్పు

(35వ పేజీ తరువాయి)

"గమనించేరా, అది ఆడకుక్క. పిల్లల పట్ల కొంత సాఫ్ట్‌కార్నరుంటుంది" వెంకటేష్ అన్నాడు.

"బలేవాడివేలే, అది పిల్లలు పెట్టినప్పుడు చూడాలి దాని వయొలెంట్ నేచర్" అన్నాడు అన్వర్.

"ప్రేమిస్తే ప్రేమ దొరుకుతుంది. ప్రేమించే గుణం జంతువుల నుంచే నేర్చుకుని ఉంటాడు మనిషి. లేదా శిశిర లాంటి చిన్న పిల్లల నుంచి" అన్నాడు రహమత్. లాంచీలో మ్యూజియం చూడ్డానికి వెళ్తుంటే కుక్కను తీసుకురమ్మని పేచీ పెట్టి చాలా ఏడ్చింది శిశిర. కుక్క కూడా నదివొడ్డున చాలా దూరం పరుగెత్తి శిశిర పట్ల తన ప్రేమను ప్రదర్శించింది. అరుణ మౌనంలోని అసహనం నవీన్‌కొక్కడికే అర్థమౌతోంది.

ఆరాత్రి నవీన్ గాఢమైన నిద్రలోఉండగా తట్టిలేపింది అరుణ.

"పద నవీన్, మనం ఇంటికెళ్లిపోదాం"

"ఇప్పుడా, ఇంత రాత్రివేళ?" నిద్ర మత్తు వదిలిపోయింది నవీన్‌కి.

"మనం నాల్గు రోజులుందామని వచ్చాం గుర్తుందా?"

అప్పటికే విడిచిన బట్టలన్నీ ఒక బేగ్‌లో అస్తవ్యస్తంగా కుక్కేస్తోంది.

ఏమైనాసరే వెళ్లితీరాలనే పట్టుదల ఆమె ముఖంలో ప్రస్ఫుటంగా కన్పిస్తోంది.

నిద్ర పోతున్నవాళ్లను డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేక అందరికీ మెసేజ్ ఫ్లాష్ చేసాడు. కారిడార్లో పడుకున్న డ్రైవర్ని తట్టిలేపి ఉదయం బస్సులో రమ్మని డబ్బులిచ్చేడు.

చప్పుడు కాకుండా బేగ్స్ కారులో సర్దేక శిశిరను అపురూపంగా హత్తుకుని కారు దగ్గరకొచ్చింది అరుణ.

కుక్క చూడనే చూసింది. పరుగెత్తుకొచ్చింది. కుయ్యి కుయ్యిమని సన్నగా అరుస్తూ అరుణ చుట్టూ తిరుగుతోంది. పాపాయిని వెనక సీట్లో పడుకోబెట్టి వెంటనే డోర్ మూసేసింది అరుణ.

రామూ కారు డోర్‌ని గోళ్లతో గీరుతోంది. పాపాయిని తీసుకెళ్లిపోవద్దని బాధ నిండిన గొంతుతో తన భాషలో అభ్యర్థిస్తోంది. రయ్యిన బయలుదేరిన కారువెనక అరుస్తూ పరుగెడుతోంది. కొంత దూరం అలా వచ్చి ఇక పరుగెత్తలేక ఆగిపోయింది కుక్క.

ఎందుకో తెలీదు హఠాత్తుగా అరుణ ఎక్కిళ్లు పెట్టి ఏడ్చింది.

దుఃఖం ఉధృతి తగ్గిందన్పించేక ఎడమచేతిని చాచి ఆమె తలను తన భుజానికి ఆన్చుకున్నాడు నవీన్.

తెలతెలవారుతూండగా కారు ఇంటికి చేరుకుంది.

డేష్ బోర్డుమీది ఇంటి తాళంచెవి తీసుకుని అరుణ కారు లోంచి బైటికి దుమికింది.

శిశిరను ఎత్తుకుని నవీన్ అరుణ వెనక ఇంట్లోఅడుగుపెట్టేడు.

హాల్లో లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

లక్ష్మి సోఫాలో ముడుచుకుని నిద్రపోతోంది.

అరుణ ఏకాఎకి సోఫా దగ్గరకెళ్లి కూర్చుని లక్ష్మి తలనిమిరింది.

జుట్టు సవరించింది. ఆ పిల్ల భయం భయంగా కళ్లు విప్పి చూసింది. "లక్ష్మీ, నన్ను నమ్ము, ఇంకెప్పుడూ నిన్ను ఒక్కదాన్నీ వదిలేసి వెళ్లను. ప్రామిస్. రేపట్నుంచీ నువ్వు నా పెద్ద కూతురివే" అంది.

"నవీన్! లక్ష్మి పుస్తకాలు ఎక్కడున్నాయో వెతికిపెట్టు. లేనివి రేపు కొని తెచ్చిపెట్టు. వచ్చే సంవత్సరమో, ఆపై యేడో ఎంట్రన్స్ పరీక్ష రాయిద్దాం తనచేత. మరిచిపోకు"

మెట్లెక్కుతున్న నవీన్‌కి విన్పించాలని గట్టిగా అరిచింది అరుణ.

"హమ్మయ్య! అరుణ మళ్లీ మామూలు మనిషైంది" అనుకున్నాడు నవీన్.